క్లుప్తంగా

పాస్టర్ ప్రవీణ్ మృతి తీరని లోటు



నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, అభిమానులు

విజయనగరం టౌన్/అర్బన్: రాజమండ్రిలో అకాలమరణానికి గురైన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరనిలోటని విజయనగరం జిల్లా క్రిస్టియన్ ఫెడరేషన్ అధ్యక్షుడు రెవరెండ్ బీఎం.రాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద క్రైస్తవ సంఘ సభ్యులతో కలిసి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రవీణ్ మృతిపై అనుమానాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎస్.మధు, పట్నాన పైడిరాజు, పి.ప్రేమానందం, ఎం.ఐజాక్, ఎం.పాల్సన్, సత్యరాజ్, వివేక్, మధుసూదన్, ఎలీషా, మధుమనోహర్, యటోప్రజు చౌదరి, నికోడమస్, సునీల్, ప్రదీప్, జయప్రకాష్, యేహెజ్కేల్, శామ్యూల్, భాస్కర్, రాజు, శేఖర్, పాల్, అలజంగి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో రక్తదాన శిబిరం



సత్కారం పొందుతున్న రక్తదాన శిబిరం నిర్వాహకులు

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన రక్తదానం, వైద్యశిబిరాలకు స్పందన లభించింది. విజయదుర్గ యువజన సంఘం, కళాశాల యాజమాన్యం సంయుక్త నిర్వహణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. అలాగే వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం శిబిరం నిర్వాహకులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ ఎస్.సతీష్‌కుమార్, ఎన్సీసీ ఆఫీసర్ ఎం.వరలక్ష్మి, ప్రశాంత్, సీఎస్ఓ సత్యనారాయణ, ఎస్వీఎస్ రాజు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి

విజయనగరం: పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ప్రణాళికా సిబ్బందికి విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఎల్ఆర్ఎస్ ఓపెన్ ఫోరం సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2024 – 25 ఆర్థిక సంవత్సరం ముగింపు సమయానికి మరో 3 రోజులే గడువు ఉన్నందున తక్షణమే ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. అలాగే ఆస్తి, తదితర పన్నులను త్వరగా వసూలు చేయాలన్నారు. సమావేశంలో టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నమాజ్‌తో మానసిక ప్రశాంతత

విజయనగరం టౌన్: నమాజ్‌తో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ముస్లింల సంఘ పట్టణశాఖ ప్రతినిధి మహమ్మద్ గౌస్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని దాసన్నపేట, పార్క్‌గేట్, కుమ్మరివీధిలతో పాటు జిల్లాలోని గొడ్డుపాలెం, రాజుల తమ్మాపురం, పెదవేమలి గ్రామాల్లో ముస్లింలకు ఉచితంగా 187 నమాజ్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాదర్‌బీబీ, ఆమీరజానీ, దావూద్, షాజన్, మదీనా తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు పతకాలు అందజేస్తున్న వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైస్ చాన్స్‌లర్ పీకే మహంతి జ్యోతి వెలిగించి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సత్ప్రవర్తనతో ముందుకు సాగినప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించగలరన్నారు. రిజిస్ట్రార్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ మాట్లాడుతూ.. విద్యార్థులు తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు..

- పోషణ్ బీ – పడాయ్ బీ పథకంతో చిన్నారుల ప్రగతి
- ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ
- వినూత్న బోధనకు శ్రీకారం



నడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



కొప్పెర్లలో విద్య అభ్యసిస్తున్న చిన్నారులు

పూసపాటిరేగ: అంగన్‌వాడీ చిన్నారుల భవిష్యత్‌కు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలనే ఉద్దేశంతో పోషణ్ బీ – పడాయ్ బీ పథకంలో భాగంగా కార్యకర్తలకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. చిన్నారులు తొలి అడుగులు వేసి విద్యనభ్యసించే అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పోషణ్ బీ – పడాయ్ బీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులు పాటు శిక్షణ ఇచ్చారు. బాల్య సంరక్షణ, మెరుగైన విద్యాబోధనపై మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

272 కేంద్రాలలో..

భోగాపురం ఐసీడీఎస్ సెక్టారు పరిధిలో 272 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు కాగా 62 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల ద్వారా 1071 మంది గర్భిణులు, 911 మంది బాలింతలు, 920 మంది ఆరు నెలల లోపు చిన్నారులు, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు పిల్లలు 4210 మంది , మూడు నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులు 3,055 మంది లబ్ధి పొందుతున్నారు. సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ బీ – పడాయ్ బీ కార్యక్రమం అమలవుతోంది. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. నూతన విద్యావిధానం అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాలలో మెరుగైన పౌష్టికాహారం అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తున్నారు. అలాగే శిక్షణ పొందిన కార్యకర్తలతో బాల్య సంరక్షణ విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ..

పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అవసరమైన వారికి వైద్య సేవలు కూడా అందిస్తున్నాం. ఆరు రోజుల శిక్షణలో చాలా విషయాలు తెలుసుకున్నాం. నేర్చుకున్న అంశాలను బోధనలో అమలు చేసి చిన్నారులకు నాణ్యమైన విద్య అందిస్తాం.

– ఎల్.అనిత, అంగన్‌వాడీ కార్యకర్త, నడిపల్లి

ఎంతో ఉపయోగం..

అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ – పడాయ్‌బీ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుంది. శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడానికి అవకాశం ఉంది. పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడమే లక్ష్యం.

– రాజేశ్వరి, భోగాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



పూసపాటిరేగ: ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు



డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు, తదితరులు

పూసపాటిరేగ: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలోని 14 పంచాయతీలకు సంబంధించి 604 మంది అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, ఇంటర్వ్యూలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది రవికుమార్, శేఖర్, రమేష్‌తో పాటు బ్యాంకర్లు పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన జరిగింది. మండలానికి 96 యూనిట్లు మంజూరు కాగా.. 610 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తుల పరిశీలనకు 549 మంది హాజరుకావడంతో అధికారులు పత్రాలను పరిశీలించారు. డెంకాడ, భోగాపురం ఎస్‌బీఐ అధికారులు, బీసీ కార్పొరేషన్ జేఏ విద్యాసాగర్, తదితరులు దరఖాస్తులు పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉగాది కవిగాయక సమ్మేళనం



కవితాపఠనం చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: సాహితీస్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ స్వగృహంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన విశ్వావసు ఉగాది కవిగాయక సమ్మేళనం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. పాయల మురళీకృష్ణ, కొత్తూరి శ్రీనివాసరావు, చెల్లపిల్ల శ్యామల నేతృత్వంలో కవులు తమ కవితా గానాలాపన చేశారు. ఉగాది పర్వదినం విశిష్టత, విశ్వావసు నామ సంవత్సరంపై కవితా పఠనం చేసి ఆహూతుల కరతాళధ్వనులందుకున్నారు. కార్యక్రమంలో చీకటి దివాకర్, చంద్రిక, మానాపురం రాజా చంద్రశేఖర్, శ్రీనివాసా, గురజాడ ఇందిర, అధిక సంఖ్యలో కవులు, రచయితలు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



విజయనగరం : దరఖాస్తుదారుల అర్హతలను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి అభ్యర్థుల దరఖాస్తులను శుక్రవారం స్థానిక రాజీవ్ స్టేడియంలో శుక్రవారం పరిశీలించారు. ఒకటి నుంచి 30 డివిజన్ పరిధిలోని అభ్యర్థుల దరఖాస్తులను అధికారులు పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. వివిధ యూనిట్లకుగాను మొత్తం 2,820 దరఖాస్తులు రాగా.. 366 యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

352 మంది హాజరు

నెల్లిమర్ల: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన దరఖాస్తుల పరిశీలనకు 352 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణరాజు మాట్లాడుతూ.. 409 మంది దరఖాస్తు చేసుకోగా.. 352 మంది హాజరయ్యారన్నారు. వారందరి దరఖాస్తులు పరిశీలించామని, మిగిలిన వారి దరఖాస్తులను వచ్చే నెల 2న పరిశీలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ సుదర్శనం, బీసీ కార్పొరేషన్ ప్రతినిధులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- ప్రభుత్వ భూముల ఆక్రమణల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు
- ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు



కౌన్సిల్‌లో కేకలు వేసుకుంటున్న టీడీపీ,జనసేన నాయకులు

నెల్లిమర్ల: ప్రభుత్వ భూముల ఆక్రమణల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను కొంతమంది సభ్యులు వ్యతిరేకించారు. సభ్యులు మాత్రమే మాట్లాడాలని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టగా.. ఇన్నాళ్లూ ఆ నిబంధన ఏమైందని జనసేన నాయకులు ప్రశ్నించారు. కల్యాణ మండపం విస్తరణ అంశంపై టీడీపీ, జనసేన నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే గాంధీనగర్ కాలనీలోని పార్క్ అభివృద్ధి విషయమై మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే ముందుకెళ్లాలని పలువురు సూచించారు. ఒకానొక సమయంలో సభ్యులు, నాయకులు ఒకరినొకరు నెట్టుకున్నారు. సర్వే నంబర్ 60లో చంద్రబాబు కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని ఎవరెవరో ఆక్రమిస్తున్నారని కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, తదితరులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి టౌన్ ప్లానింగ్ అధికారి ఫిలిప్స్ సమాధానమిస్తూ ఆ ప్రాంతంలో రెండు ఇళ్ల నిర్మాణాలను ఆపామన్నారు. కొన్ని పనుల విషయంలో టీడీపీ నాయకులను కలవమని తమకు అధికారులు చెప్తున్నారని మైపాడ ఆరోపించారు. అలాగే ఎటువంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని టీడీపీ నాయకుడు లెంక అప్పలనాయుడు సమావేశంలో ప్రస్తావించారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ అప్పలరాజు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, తదితరులుపాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

విజయనగరం టౌన్: దళిత ఉపాధ్యాయుడైన ఎస్వీ శ్రీకాంత్ అక్రమ సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేపాడ మండలం గిరిశిఖర గ్రామమైన మారికలో పనిచేస్తున్న శ్రీకాంత్‌ను రాజకీయ కుట్రలో భాగంగా ఇరికించారన్నారు. మెమో ఇచ్చిన కొన్ని గంటల్లోనే ఆయనకు కనీసం వివరణ ఇచ్చే అవకాశం కూడా కల్పించకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. వెంటనే ఆయన సస్పెన్షన్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి. త్రినాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వీటీ అగ్రహారం, బీసీ కాలనీ, మహిళా ప్రాంగణం ఏరియా, ఇతర ప్రదేశాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ కార్యాలయం ముట్టడి

విజయనగరం గంటస్తంభం: ట్రూఅప్ చార్జీలు తగ్గించడంతో పాటు సెకీ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ..సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచబోమని చెబుతూనే ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారులపై రూ. 17 వేల కోట్ల భారం మోపిందని ఆరోపించారు. సెకీ ఒప్పందం మేరకు మరో 8 వేల కోట్ల భారం వినియోగదారులపై వేయడానికి సిద్ధమవుతోందన్నారు. తక్షణమే ప్రభుత్వ పెద్దలు స్పందించి చార్జీలు తగ్గించడంతో పాటు సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, జగన్, సురేష్, నగర కమిటీ సభ్యులు వి. లక్ష్మి, రవి, రమేష్, సోమేష్, మేస్త్రీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరం..

నెల్లిమర్ల: బెట్టింగ్‌లు, గంజాయి, మద్యపానం వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ అన్నారు.నెల్లిమర్ల నగర పంచాయతీలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోండి

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు చెల్లించేందుకు మూడు రోజుల గడువు మాత్రమే ఉందని, సంబంధిత యజమానులు పన్నులు చెల్లించి 50% వడ్డీ మాఫీ సదుపాయాన్ని వినియోగించుకోవాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు సూచించారు. సెలవు రోజుల్లో కూడా పన్ను చెల్లించేందుకు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్ను చెల్లించాలని కోరారు.

పరామర్శ..





విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును పలువురు మాజీ ప్రజాప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ చిన్న కుమారుడు ప్రణీత్‌బాబు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన్ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రణీత్ బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ , కురుపాం మాజీ శాసనసభ్యుడు నిమ్మక జయరాజు, వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ చైర్మన్‌లు , మాజీ డైరెక్టర్లు పాల్గొన్నారు. – విజయనగరం

రామనారాయణంలో శ్రీరామ వేడుకలు



ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణం ప్రాంగణంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు శ్రీరామ వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యుడు నారాయణ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ప్రతిరోజూ ఉదయం శ్రీమద్రామాయణ పారాయణం, రాత్రి 7 గంటలకు స్వర్ణ పుష్పార్చన ఉంటుందన్నారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నీరజవల్లి, చంద్రకళ, దేవాలయం అర్చకులు చాణక్య, పీఆర్ఓ రమణ, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం రూరల్

అందుబాటులో డంపర్‌బిన్లు



నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన 47 డంపర్ బిన్లు శుక్రవారం అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వాటిని స్థానిక పాలస్పత్రి వద్ద నున్న మస్టర్ పాయింట్‌లో భద్రపరిచారు. – విజయనగరం

సహస్ర దీపాలంకరణ..



రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. వెండి మండపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మండపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచారు. అనంతరం దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్, రామగోపాలాచార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

దర్బార్ ఒక తపోక్షేత్రం..



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న దివ్యామృత స్వామీజీ

విజయనగరం టౌన్: హజరత్ ఖాదర్‌బాబా దర్బార్ ఒక తపోక్షేత్రమని సత్యసాయి ట్రస్ట్ ఉచిత క్యాన్సర్ ఆస్పత్రి కార్యనిర్వాహక ప్రతినిధి దివ్యామృత స్వామీజీ అన్నారు. భీమిలి ఆనందఆశ్రమ స్వామీజీ రామకృష్ణానంద, శిష్య బృందంతో కలిసి బాబా మెట్టలోని ఖాదర్‌బాబా దర్బార్‌ను శుక్రవారం సందర్శించారు. వీరికి దర్బార్ ధర్మకర్త ఖలీల్‌బాబు, వారి తనయుడు అహ్మద్‌బాబు సంప్రదాయం ప్రకారం సాదర స్వాగతం పలికి, బాబా వారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రంజాన్ మాసం పురస్కరించుకుని దర్బార్‌లో జరుగుతున్న ఇఫ్తార్ విందును ఉపవాస దీక్షాపరులు, బాబా భక్తులు, ప్రజలకు దివ్యామృత స్వామీజీ, రామకృష్ణ నందాజీలు వడ్డించారు.

పారిశ్రామిక ఆలోచనలు పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎమ్ ప్రసాద్, గైడ్ టీచర్లు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక ఆలోచనలను పెంపొందించుకోవాలని కొండగుంపాం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎమ్ ఎం. ప్రసాద్ సూచించారు. ఈఎండీపీ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన 'కొడవలిలో ప్రథమ చికిత్స కిట్' అనే ప్రాజెక్ట్ జిల్లా స్థాయికి ఎంపికైందన్నారు. ఏప్రిల్ రెండో తేదీన జరగనున్న జిల్లాస్థాయి ప్రదర్శనలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్లు సంజయ్ కుమార్, సత్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలుంటే తెలియజేయండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: వేసవి దృష్ట్యా నగరంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. సమస్యలు తెలియజేసేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తిన వెంటనే ప్రజలు 98499 06486 నంబర్‌కు ఫోన్‌ద్వారా గాని వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వేసవి కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఎమినిటీస్ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు. అలాగే వీధి దీపాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఈలు ప్రసాద్, శ్రీనివాసరావు, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు చల్లదనం



పురవీధుల్లో ఘటాలతో ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం జిల్లా కేంద్రంలోని మంగలవీధిలో కొలువైన నూకాలమ్మకు శుక్రవారం చల్లదనం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ముర్రాటలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విచిత్ర వేషధారణలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం